# ప్రశ్న

గజిబిజిగా వుంది మనసంతా. ఈ రోజు జరిగిన సంఘటనలు తలచుకుంటే కంపరమెత్తుతోంది. పరధ్యానంగా ఏదో ఆలోచిస్తున్నాడు. ఎంతకీ తెగడం లేదు. అలా ఆరు బయట తిరిగొస్తే కాస్త మనసు కుదుటపడుతుందని లేచాడు. అలా బీచ్ వైపు వెళ్ళాడు. సముద్రపు హోరుతో కోలాహలంగా వుంది బీచ్ అంతా. ఉవ్వెత్తున లేచే కెరటాలను చూచి పిల్లలు కేరింతలు కొడుతున్నారు. పెద్దల ఉత్సాహంతో పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. కొన్ని జంటలు హాయిగా కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతా ఆనందంగా వుంది అక్కడి వాతావరణమంతా. కాని ఇవేమీ పట్టనట్టు ఒక రాతి బెంచి మీద కూర్చున్నాడు తను. మనసులో మరల ఆలోచనలు ముసురుకుంటున్నాయి.

తను ఒక్కరే కొడుకు కావడం మూలాన బి.ఎ. పట్టా చేతికొస్తూనే తల్లిదండ్రులు పెళ్ళి చేశారు. అమ్మాయి మాత్రం ఎం.ఎ. చేసింది. పైపెచ్చుగా ఒక ఆఫీసులో ఉద్యోగం. ఇద్దరు పిల్లలు పుట్టిన వరకూ సంసారం ఎలాగో సాగిపోయింది. అప్పుడే మొదలయ్యింది అంతర్యుద్ధం. తను చిన్న వ్యాపారం పెట్టుకుని సంసారం సాగిస్తున్నాడు. ఆవిడేమో నెలకు పన్నెండు వందల రూపాయిల జీతం పట్టుకొస్తుంది. ఈ చాకిరీ ఎవరుచేస్తారు అనే విసుగుతో ప్రారంభం అయింది. ఎం.ఎ. చదివి కూడా ఇంత చాకిరీ. ఆఫీసు పని ఇవన్నీ నేనే చూసుకోవాలా. ఎం.ఎ. చదివిన నేను మా వాళ్ళకి మాత్రం ఏమీ సహాయం చెయ్యకూడదా? బి.ఎ. చదివిన మీరు మాత్రం మీ బంధువులకి సహాయం చెయ్యొచ్చా? ఇదెక్కడి న్యాయం. అని చులకన చేసి మరీ చురకలు అంటిస్తోంది. అవున్లే మీ బి.ఎ. బుర్రకి ఏం అర్థం అవుతుంది లెండి విసుర్లు విసిరింది.

అప్పుడు ఆలోచించాడు తను ఎం.ఎం. చదివిన మగవారు పదవక్లాసు చదివిన అమ్మాయిని చేసుకుని సుఖపెడ్తున్నారు. కాని ఈ ఆడవాళ్ళు కొంచెం ఎక్కువ చదివితే ఎందుకు చులకనగా చూడడం? ఎక్కడుంది తారతమ్యం? ఎక్కడ నుంచి వస్తుంది సమానత్వం? వ్యాపారం కాని వ్యవసాయం కాని చేస్తే భార్యని పోషించుకోలేరా? ఉద్యోగం చేస్తేనే సుఖపెట్టగలరా? అన్నీ శేష ప్రశ్నలే ఎక్కువగా ఆలోచిస్తే అసలు గమ్యం ఎటో తెలీకుండా పోతుంది అని లేచాడు ఇంటివైపు అడుగులు వేస్తూ.

— పి.విజయభాస్కరరెడ్డి

# ప్రాస




పోస్ట్ అన్న పిలుపు వినబడగానే ముందు గదిలో వున్న నేను వరండాలోకి వచ్చేసరికి నేలమీద పడ్డ ఉత్తరాన్ని నోట కరచుకుని పారిపోతుంది మా జానీ. జానీ అంటె మీకు తెలీదేమో? అది మా పెంపుడు కుక్క. దాని వెంటపడి నోట్లోని ఉత్తరాన్ని లాక్కున్నాను. లేకపోతే ఏదో మూల ఎవరికీ కనబడకుండా కూర్చొని ముక్కలు ముక్కలు చేసేస్తుంది. ఆ ఉత్తరం వాసు వ్రాశాడు. మా మిత్ర బృందంలోని మిగతా ముగ్గురు కూడా వస్తున్నట్టు అంతకుముందే ఉత్తరాలు వ్రాశారు. మేం ఐదుగురం ప్రతీ సంవత్సరం సంక్రాంతి శెలవులకి మా ఊళ్లో కలుసుకోవడం ఆనవాయితీ. మా ఊరు పల్లె అనడానికి, పట్టణం అనడానికి వీలులేదు. ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్న పెద్ద గ్రామం. శ్రీకాకుళం జిల్లాలో చివరగా, ఒరిస్సా ఒడ్డున వంశధార నదికి ఇవతలివైపు వుంది.

ఒక శుభ ముహూర్తాన మా వాసు, రాంజీ, సురేష్, మోహన్రావ్ అందరూ కట్టగట్టుకొని దిగిపోయారు. నా ఆనందానికి అవధుల్లేవు. మా మిత్ర పంచకం కలిస్తే పదివేల కోతులు కూడా సరిరావు. రోజంతా తోటల్లోనూ, వంశధారా నది ఒడ్డులోనూ గడిపేసరికి రోజులు తెలీడం లేదు. ఒక రోజు మా అత్తయ్య మా ఇంటికి వచ్చి "మీరందరూ రేపు మా ఇంటికి భోజనానికి రండి, రోజంతా మా ఇంట్లోనే వుండాలి అని చెప్పింది. మాకు అంతకంటే ఇంకేం కావాలి. మర్నాడు ఉదయం ఏడు గంటలయిందో, లేదో అందరం వాళ్ల ఇంటిముందు చేరిపోయాం. ఇంత తెల్లవారే వస్తారని అనుకోలేదని మా అత్త విస్తు పోయింది.

"మేం మాటంటే మాటే" అని అందరం కోరస్‌గా అన్నాం "ఇప్పుడు బ్రష్ కూడా మీ ఇంట్లోనే చేస్తాం" అని నేను అన్నాను. "అందరికీ బ్రష్‌లూ, పేస్టు తెప్పించు — లేకపోతే ఈ రోజు మీ ఇంట్లో వుండం" అని తెగేసి చెప్పాడు సురేష్. మా మామయ్యకు అందరం వరసైన వాళ్లమే.

# హిపోక్రసీ



డియర్ బ్రదర్!


సంవత్సరానికి ఒక్కసారి గుర్తొస్తానన్నమాట నీకు. బాగుందిరా. నాకు తెలీకడుగుతాను-సంవత్సరంలో నీకు ఒక్క రోజైనా ఖాళీ దొరకదంటావా- కనీసం ఒక్కటంటే ఒక్క ఉత్తరం 'అక్క-బావ'లకు వ్రాయడానికి? నాకు తెలిసినంతవరకు నువ్వేమంత రాచకార్యం వెలగబెడ్తున్నావనుకోను- ఉత్తరం ముక్క రాసి పడేసేంత సమయం దొరక్కపోవడానికి.

అసలు మనసులో లేనిది- కాగితాల మీద ఎలా వస్తుంది? ఆ బ్రిటిషువాడో- అమెరికావాడో చేస్తున్నాడని, పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా వాడ్ని చూసి కాపీ కొట్టి మనమూ వాళ్లంత అయిపోయాం అనుకుంటే అవివేకమే అవుతుంది. వాళ్ల ఏం చేసినా నిర్భయంగా చేస్తారు. ఇష్టముంటే కలిసి వుంటారు, లేకపోతే విడిపోతారు. మనలాగా లేనిది వున్నట్టు నటించే హిపోక్రసీ వాళ్లలో చాలా తక్కువనుకుంటాను. వాళ్లలో వున్న మంచిని, డిసిప్లిన్‌నీ నేర్చుకోవడం పోయి పనికిరాని ఫార్మాలిటీస్ మాత్రం అనుకరించి అఘోరిస్తున్నాం.

సంవత్సరంలో ఒక్కసారైనా అక్కా- బావల క్షేమ సమాచారాలు తెలుసుకోవాలని, ఒక్కసారి నీ ఇంటికి రమ్మని పిలవాలని, పోనీ నువ్వైనా మా ఇంటికి రావాలని అనిపించదా? ఏం మనకు రక్త సంబంధం లేదా? బంధుత్వం అంటే ఒకరి క్షేమ సమాచారాలు ఒకరు తెలుసుకుంటూ వుండడం, ఒకరింటికి ఒకరు వస్తూ పోతుండడం కాని, ఏడాదికొకసారి బజార్లో దొరికే ఓ గ్రీటింగు కార్డు కొని మొక్కుబడిగా పడేయడం కాదు.

మరెప్పుడూ న్యూ ఇయర్ గ్రీటింగ్స్ పంపించకు నాకు. డబ్బు వృథా.

—పి.లక్ష్మీశారద



అతను అప్పుడే కాబోలు లేచి వాకిట్లోకి వచ్చాడు. ఏదో గొడవ లాగుందని, తీరా మమ్మల్ని చూసి అందర్నీ పలుకరించాడు. మా దంతధావన తీర్మానం విని లోపలికి వెళ్లి వేప పుల్లల కట్ట తీసుకొచ్చి మా ముందు పెట్టి "కానీయండి" అన్నాడు.

"చస్! ససేమిరా వీల్లేద"న్నాము. "అయితే, పోండి" అని ఒక్క ముక్క చెప్పి, ఇంట్లోకి వెళ్లి" పళ్లు తోముకోకుండా వుంటే టీ నీళ్లు కూడా ఇయ్యొద్దని అత్తయ్యకు ఆర్డరు జారీ చేశాడు. మేం మొండికేసి కూర్చున్నాం. సుమారు ఎనిమిదిన్నర గంటలు దాటిపోయింది. ఆమరణ నిరాహార దీక్ష చెయ్యడానికైనా సిద్ధమేగానీ, వేపపుల్లతో పళ్లు తోముకోమని భీష్మించుకు కూర్చున్నాం. మా మావయ్యకు తెలీకుండా ఒక పేస్టు, బ్రష్‌లు తెప్పించి "మీ మామయ్యకు కనబడకుండా పెరట్లోకి వచ్చి బ్రష్ చేసుకోమంది మా అత్తయ్య. అలాగే అని చెప్పి ఆ తరువాత అందరం బ్రష్‌లు పట్టుకుని మా మామయ్యముందు నిలబడి బ్రష్ చేస్తున్నాము, అతన్ని వెక్కిరిస్తున్నట్టు. అతను ఏమీ అనలేదు. మాకు మనసుండబట్టడంలేదు. అతన్ని ఎలాగైనా ఉడికించాలనిపించింది. అంతలో మా వాసుగాడు "మామా! కావాలా పేస్టు" అని దుర్యోధనుడిలాగ ఫోజు కొట్టాడు. ఇంతలో మా సురేష్ "వద్దులే అతనికిది వేస్ట్" అన్నాడు. "అయినా అది చాలా కాస్ట్" అని మరొకడు, "పళ్లకు చాలా బెస్ట్" అని నేనూ, ఇలా ఒక్కొక్కరం ఒక ప్రాస చొప్పున ఏదో ఒకటి వాగుతున్నాం. అతను నిదానంగా వేపపుల్ల నములుతున్నాడు. మా ప్రాసలకి అంతం లేకుండా పోయింది. అతను మా అందరి వైపు తిరిగి "ఎందుకురా అలా బీస్ట్‌ల్లాగ అరుస్తారు" అని తక్కున అన్నాడు. అంతే, తలా ఒక దిక్కుకి చెదరిపోయాం. మరి ఆ రోజు అతని కంటపడలేక పోయాం.

—యెలిశెట్టి పాపారావు

# సంస్కారం



ఒకసారి బొంబాయిలో తెలిసినవారింటికి వెళ్ళాము. ఆ రోజు వారింట్లో తద్దినం.

బ్రాహ్మలు వచ్చి మంత్రం చదివి భోజనాలు చేశారు. పితృ దేవతల కోసం పెట్టిన పిండాలు కలపడానికి చేరువలో నదులుగాని, పెట్టడానికి ఆవులు గాని, వేయడానికి నిప్పులుగాని, గోతులు తీయడానికి మట్టే జాగాగాని లేకపోవడంవల్ల స్కూటర్‌పై వెళ్తున్న ఆ బ్రాహ్మలకే ఇచ్చేశారు ఎక్కడో కొన్ని మైళ్ళ దూరాన గల చెరువులో కలపమని.

ఇక మిగిలిన అందరి భోజనాలు అయ్యాయి. అందరూ సుష్టుగా సాయంకాలం నాలుగు గంటలకి భోజనాలు చేశారు. ఇక రాత్రికి ఎవరికీ ఆకళ్ళు లేవన్నారు.

పదార్థాలు, పిండి వంటలు మిగిలిపోయాయి. అవి పితృ శేషం కాబట్టే మర్నాడు తినకూడదుట. హీన జాతిది కాబట్టే పనిమనిషికి ఇవ్వకూడదుట. బయట పడేస్తే అశుద్ధం తినే కుక్కలు, హీన జాతి వాళ్ళు తింటే పితృదేవతలకి అపచారం చేసినట్టుట. ఇరుగుపొరుగులకి ఇవ్వకూడదుట. అందుకని మిగిలిన పదార్థాలు, పిండి వంటలు, బ్రాహ్మలు భోంచేసిన విస్తళ్ళు (చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి) అన్నీ తీసుకెళ్ళి కక్కస్‌లో పోసిందా ఇల్లాలు.

అశుద్ధం తినే కుక్కలు,తక్కువ కులాల వారు ముట్టుకుంటేనే పితృ దేవతలకి అపచారం చేసినట్టు భావించే వీరు- అశుద్ధానికి నిలయమైన కక్కస్-పవిత్రమైనదని భావిస్తున్నారు. ఇలాంటి నమ్మకాన్ని ఏమనాలంటారు!

— ఆర్.ఎస్. హైమవతి

# దైవోపాయం

'పోస్ట్' పోస్ట్‌మేన్ కేక వినిపించింది. పిల్లల యూనిట్ పేపర్లు దిద్దుతున్న రాజారావు ఉత్తరం అందుకోడానికి లేవబోయాడు. ఈలోగానే అతని భార్య వంట గదిలోంచి పైట కొంగుతో చెయ్యి తుడుచుకుంటూ వడివడిగా వచ్చి కవరు అందుకుంది. అతని దగ్గరకు తెచ్చేలోగానే సాంతం చదివేసి అతని చేతికిచ్చింది. అది ఓ కరపత్రం! ఆశ్చర్యపోతూనే చదివాడు రాజారావు.

"సంతోషిమాత భక్తుల కోర్కెలు తీర్చే దేవత. ఆమె నామాన్ని ప్రతిరోజూ అరగంట జపించిన వారికి కోరిన కోరికలు సిద్ధించును. అట్లు చేసిన ఒక నిరుపేద ధనవంతుడయ్యెను. సంతానము లేని ఒక ఇల్లాలు సంతానవతి అయ్యెను. ఒక నిరుద్యోగికి ఉద్యోగము లభించెను. కావున, ఆ తల్లిని పూజించి మీ కోర్కెలు తీర్చుకొనండి. ఇది చదివినవారు ఇదే విధముగా ఏభై కరపత్రములు ప్రింటు చేయించి మీ స్నేహితులకు పంపండి. అట్లు చేయనియెడల మీరు కష్టనష్టాలకు గురియగుదురు... ఇట్లు ఒక భక్తురాలు."

రాజారావుకు ఆ కరపత్రాన్ని ముక్కలు ముక్కలు చేసి నమిలి మింగేద్దామన్నంత కోపం వచ్చింది. కాని, అతని భార్య ఓ సెంటిమెంటల్ ఫూల్. నిజంగా ఏదైనా చెడు జరిగితే 'ఆ రోజు ఆ కాగితాన్ని చింపారు. అందుకే ఇలా జరిగింది' అంటూ తనని తినేస్తుంది. అందుకే ఆలోచిస్తూ వుండిపోయాడు.

అతను నాస్తికుడు కాదు కాని దేవుణ్ణే అడ్డుగా పెట్టుకొని మనిషి చేస్తున్న వ్యాపారాన్ని అతని మనసు తీవ్రంగా గర్హిస్తోంది. అతనలా ఆలోచనలో వుండగానే అతని భార్య వాళ్ళ పెద్దబ్బాయిని పిలిచి ఆ కరపత్రంలోని మేటర్‌ను ప్రింటింగ్ ప్రెస్‌కు పంపే ఏర్పాటు చేసింది. కవర్లు తెమ్మని చిన్నబ్బాయిని పోస్టాఫీసుకు తోలేసింది. రాజారావు అవాక్కయి కూర్చుండిపోయాడు.

కరపత్రాలు! కరపత్రాలు!! సంతోషిమాతను కీర్తిస్తూ కరపత్రాలు! వచ్చిన ప్రతివారికి ఏభై కరపత్రాలు ప్రింట్ చేసి అందించలేక ఆ ఊళ్ళో ప్రెస్ యజమాని తలమునకలవుతున్నాడు.

సంతోషిమాత పుణ్యమాని అతనికి చేతినిండా పని, జేబునిండా డబ్బు! అతనికి మహదానందంగా వుంది. ఎందుకంటే పెళ్ళిళ్ళ సీజను అయిపోయి ఖాళీగా వున్న తనకు ఒక రోజున మెరుపులా తట్టిన ఒక ఆలోచనకు ఇది ఊహించని రెస్పాన్స్ కనుక.

— గుబ్బల సత్యనారాయణమూర్తి